# 'వెదురు వృక్షజాతికి చెందినది కాదు'

**అటవీయేతర,** ప్రైవేటు భూములలో పెంచే వెదురును నరికి, తరలించటంనుండి మినహాయించాలని అటవీ చట్టాలను మారుస్తూ 2017 నవంబర్ 23న కేంద్రప్రభుత్వం ఓ ఆర్డినెన్సు జారీచేసింది. సవరణ బిల్లు రూపంలో నాలుగు వారాలలో ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. డిసెంబర్ 18న లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించగా, డిసెంబర్ 19న రాజ్యసభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది.

ఈ సవరణ ప్రకారం ఇక నుండి "వెదురు, చెట్టుకాదు". అయితే, విషయం అది కాదు. వెదురు గడ్డిజాతికి చెందినదని, వృక్షజాతి కాదనే విషయం అందరూ అంగీకరిస్తారు. భారత అటవీ చట్టం క్రింద 'వృక్షాల జాబితా'లో, బ్రిటిష్ వలస పాలకులు వెదురును కూడా చేర్చారు. ఆవిధంగా వెదురును నరికి, అమ్మే పూర్తి అధికారం అటవీశాఖ పరిధిలోకి వచ్చింది. ఆదివాసీలకు, అడవులలో నివాసముండే ఇతరులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే పేరిట వెదురును వృక్షజాతి నుండి తొలగించాలనే దానిలో రాజకీయ పార్టీలన్నిటి నడుమ ఏకాభిప్రాయం వుంది.

పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా ప్రభుత్వం ఆర్డినెన్స్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నాలుగు వారాల వ్యవధిలోనే చట్ట సవరణకు పార్లమెంటు ఆమోదం పొందటానికి ఎందుకింత తొందరను ప్రదర్శించిందనేది ప్రశ్న. విపక్ష పార్టీలు పార్లమెంటులో ఈ ప్రశ్నను అడుగగా, అటవీ పర్యావరణ శాఖామంత్రి హర్షవర్ధన్ జవాబు చెప్పకుండా తప్పుకున్నాడు. అడవులను లూటీ చేసుకోవటానికి, ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు మాత్రమే ఈ చర్య ప్రయోజనకారి అని విపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శించాయి.

94 శాతం వెదురు అటవీ భూములలో పెరుగుతుండగా, కేవలం ఆరు శాతం మాత్రమే, అటవీయేతర, ప్రైవేటు భూములలో పెరుగుతోంది. 24 శాతం వెదురు, పరంజాల నిర్మాణానికి వినియోగిస్తుండగా, తరువాత అధిక స్థాయిలో 20 శాతం వెదురును కాగిత పరిశ్రమలో వినియోగిస్తున్నారు. అటవీయేతర భూమిలో పెరిగిన వెదురును వృక్షజాబితా నుండి తొలగించటంతో, బీడు భూములు, నదీతీరాలు, రోడ్డుప్రక్కన, రైల్వేట్రాక్ పొడవునా వెదురు సాగును ప్రోత్సహించే పథకాలున్నాయని, తద్వారా కలప, పల్ప్‌వంటి అనుబంధ ఉత్పత్తుల దిగుమతి తగ్గిపోతుందని నీతి ఆయోగ్ ఆర్థికవేత్త రమేష్‌చాంద్ పేర్కొన్నాడు.

ఛత్తిస్‌గఢ్‌లో, వెదురును వృక్షజాబితానుండి తొలగించి వెదురు నరకటాన్ని, అమ్మటాన్ని గ్రామ పంచాయితీ బాధ్యతకు అప్పగించారు. వార్తా కథనాల ప్రకారం, గ్రామపంచాయితీలు ప్రతి సం॥మూ అనేక కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించి, దానిని అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నాయని తెలుస్తోంది. ఒక శతాబ్దంపైగా కాలంనుండి అటవీశాఖ ఈ డబ్బును లూటీచేస్తోందని అర్థమౌతోంది. ఈ చట్టంద్వారా ఈ లూటీ కొనసాగించబడుతోంది.

అటవీ హక్కుల చట్టం ఈపాటికే వెదురును అల్పమైన అటవీ వుత్పత్తిగా పేర్కొంటోంది. వెదురును నరికి, అమ్ముకునే హక్కును ఈ చట్టం ఆదివాసులకు కల్పిస్తోంది. అయినప్పటికీ అటవీ చట్టం సవరించలేదనే కృత్రిమ సాకుతో అటవీశాఖ, ఈ హక్కును వినియోగించుకోనీయకుండా ఆదివాసులను అడ్డుకుంటోంది. ప్రస్తుతం చేసిన ఈ సవరణచట్టం, అటవీ భూములలో పెరిగిన వెదురును మినహాయించటంద్వారా ఈ చట్ట విరుద్ధమైన దానినే స్థిరీకరిస్తోంది. వాస్తవంగా ఆదివాసులకు చెందవలసిన వెదురు ద్వారా వచ్చే ఆదాయాన్ని అటవీశాఖ లూటీ చేయటాన్నే ఈ సవరణ చట్టం కొనసాగిస్తుంది.

యుపిఏ ప్రభుత్వం నేషనల్ బ్యాంబూమిషన్ (ఎన్‌బిఎమ్)ను ప్రారంభించింది. 'నేషనల్ అగ్రో ఫారెస్ట్ అండ్ బ్యాంబూమిషన్'గా ఎన్‌డిఏ ప్రభుత్వం దాని పేరు మార్చింది. వివిధ మంత్రిత్వశాఖల నడుమ సమన్వయ వ్యవస్థగా పనిచేయటమే రెండింటి యొక్క ఒకే లక్ష్యం. ఏమైనా ఈ 'మిషన్' కింద సాంవత్సరిక కేటాయింపులు తగ్గిపోతూండగా, కేటాయించిన నిధులలో అధికభాగం ఖర్చు చేయకుండా మిగిలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అటవీయేతర భూములలో వెదురును ప్రోత్సహించటమనేది నిరుపయోగమైనది. ఈ విధంగా 'సవరణ చట్టం' అడవులలో వెదురును చట్టవిరుద్ధంగా నరికి వేయటాన్ని ప్రోత్సహిస్తుంది; ఎందుకంటే ప్రైవేటుగా పెంచిన వెదురును, అటవీ వెదురును ఏవిధంగా వేరుచేయలేము గనుక!.

ఆదివాసులు ప్రకృతి విధానాలను బాగా తెలిసివుంటారు. వెదురు పొదలుగా పెరుగుతుంది. ఆదివాసులు ముదురు వెదురును నరికి, లేతగా వున్న వెదురును పెరగటానికి వీలుగా వదిలివేస్తారు. దీనితో వెదురు పొదలు ఎప్పుడూ పెరుగుతూనే నిండుగా వుంటాయి. విచక్షణారహితంగా వెదురు పొదలను వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా నరికివేయటం జరుగుతుండటంతో, వెదురు కనుమరుగయ్యేదిగా మిగిలిపోతుంది. పేపరు మిల్లు యాజమాన్యాలు తూర్పుగోదావరి జిల్లాలో సాగించిన విచక్షణారహిత నరికివేతతో ఇదే సంభవించింది.

అటవీ చట్టానికి ఇంత వేగంగా ప్రభుత్వం సవరణచేయటం, ప్రైవేటు పారిశ్రామికాధిపతులకు ప్రయోజనం చేకూర్చటానికి, అటవీ వెదురు అమ్మకంద్వారా ఆదాయాన్ని గ్యారంటీ చేయటానికే. ఇది ఆదివాసీ అనుకూల, పేదల అనుకూల చట్టం ఎంతమాత్రం కాదు.

ooooo